# తొలగిన తెరలు




విజయ

ఆ ఆకాశం నిండా నల్లటి మబ్బులు పరుగులిడుతున్నాయి. అరగంటక్రితం మరుక్షణ పొడిచిన ఎండ ఏమయిందో కానీ ఒక్కసారి చల్లటి పరిమళం భరిత మైన గాలులు శరీరాన్ని తాకుతున్నాయి. దూరంగా వర్షం పడుతోంది కాబోలు మట్టివాసన వేస్తోంది. మేడపైన విశాల మైన డాబామీద నిలబడి హుందాగా సిగరెట్ కాలుస్తున్నాను. చల్లటి ఈ వాతావరణంలో ఇదొక్కటే నా మెదడును చురుగ్గా పని చేయించేది. సిమెంట్ స్తంభాన్ని ఆనుకుని క్రింద ఉండే భవనాల్ని చూస్తూ నిలబడ్డాను. మా లొకాలిటీలో ఉండేవన్నీ ఖరీదయిన బంగళాలే. వొకదాన్నొకటి తీసిపోకుండా కట్టినవే. మా ఎదురింటిమేడ చాలా విశాలంగా ఫాషన్‌బుల్ డిజైన్స్‌తో కట్టబడివుంది. నేనింత తీరిగ్గా నిలబడి చూస్తూ నిలబడ్డం

ఇదే మొదటిసారి! ఇరవై నాలుగు గంటలూ బిజినెస్ వ్యవహారాలు చూసుకో డానికే టైమ్ అంతా సరిపోయేది. ఈ వాళ తీరిగ్గా వున్నానంటే కారణం మా మామయ్య వాళ్ళ ఫామిలీ కలకత్తానుంచి నిన్ననే వచ్చారు. వాళ్లకు ఈ రాత్రి మా ఇంట్లో డిన్నర్ అరేంజ్ చేశాం. వాళ్ళు సాయంత్రమే వస్తామని చెప్పడంతో నాన్న సలహామీద బిజినెస్ వ్యవహారాలన్నీ అయినమటుకు చూసుకుని త్వరగా ఇంటికి తిరిగి రావాల్సివచ్చింది. సిగరెట్ పొగ వదులుతూ ఆ పొగకేసి చూస్తు న్నాను. రెండు నిముషాలనంతరం సిగరెట్ ఆవలికి విసిరి బాల్కనీ గోడ పట్టుకుని వంగి చూసేసరికి ఎదురింటికి కారు వచ్చి ఆగింది. అందులోంచి పంజాబీ డ్రస్ వేసుకున్న అమ్మాయి, హిప్పీసారీ కట్టిన మరో యువతి, మధ్య వయస్కురాలైనా ఫాషన్స్ వదలని ఒకా విడ దిగారు. నడివయస్కురాలు ఆగి వాళ్లతో ఏదో చెబుతోంది. చీర కట్టు కున్న బాబ్డ్ హెయిర్ యువతి మా ఇల్లు చూస్తోంది. మా కాలనీకంతా పెద్దది ఆకర్షణీయమైనది మా ఇల్లే. అత్యాధు నికంగా, ఫారిన్ మెటీరియల్‌తో మా ఫాదర్ స్వయంగా దగ్గరుండి కట్టించడం వల్లనేమో ప్రతి ఒక్కర్ని ఆకర్షించేది మా ఇల్లు. నచ్చిందేమో తలెత్తి మరీ చూసింది. నన్ను చూడగానే ఉలిక్కి పడ్డట్టు సర్దుకుంది. చప్పున చూపులు తిప్పుకుని గబగబా లోపలికిపోతూ మరో సారి వెనుదిరిగి చూసి వెళ్ళిపోయింది. అందరూ వెళ్ళిపోయినా నా మనసులో చీర కట్టుకున్న అమ్మాయి చూపులు క్షణంసేపు మెదలి మగురున పడ్డాయి.

నేను ఉలిక్కిపడి బాల్కనీ గోడను పట్టుకున్న చేతులు వదిలేసి నిటారుగా నిల బడ్డాను. మా నౌకర్ బాలయ్య నన్ను ఎగాదిగా చూసాడు. వాడి కళ్ళు ఆనం దంతో మెరుస్తున్నాయి. "అయ్యగారు పిలుస్తున్నారు బాబూ" అన్నాడు. నాన్న పిలుస్తున్నారనగానే నేను రెండుమూడు మెట్లు జంప్‌చేస్తూ క్రిందకు వచ్చాను.

"రాజీవ్. మీ అంకుల్ వాళ్లు ఫోన్ చేసారు. మరో అరగంటలో వస్తారట" అనిచెప్పి బిజినెస్ ఫైల్స్ కావాలంటే షెల్ఫులోంచి తీసియిచ్చి కాసేపు నాన్నతో మాట్లాడి లేచాను. బయట ఏదో కారాగిన చప్పుడు విని నాన్నకోసం ఎవరో వచ్చి వుంటారని గ్రహించి మళ్లీ పైకెళ్లి పోయాను.

నేను పైకి వెళ్ళేసరికే వర్షం మొద లయింది. వరండాలో కూర్చుని గ్లాస్ విండోని పైకెత్తి బోల్ట్ పెట్టి రోడ్డుకేసి చూడసాగాను. ఈ సమయంలో నా పక్క నాకు అతి సన్నిహితులుంటే ఎంత బాగుండును. సన్నిహితం అంటే నన్ను ప్రాణంగా భావించేవాళ్ళు. నిజానికి వూపిరి తీసుకోనీయనంతమంది ఉన్నారు నాకు ఫ్రెండ్స్. అందరికీ నేను కావాలి

ఫలాని లక్షాధికారి కొడుకు వాళ్ళకు స్నేహితుడని చెప్పుకుని గర్వపడేవారే అంతా. నాకు ముఖ్యంగా కావల్సినవాళ్ళు అతి కొద్దిమంది. వాళ్ళు నా హోదాకు తగిన మిత్రులంటారు నాన్న. "మనసున మనస్సై, బ్రతుకున బ్రతుకై తోడొకరుండిన " అనేపాట విన్నప్పుడల్లా నా మనసు చిత్రాతిచిత్రమైన బాధకు లోనవుతుంది. నాకు అటువంటి తోడు లభిస్తే?! ఏమో! నే నందరి హృదయాల్లో మెదులుతానని నాకు తెల్సు. అఖరలేనంత ఆస్తి, చదువు, అందం శ్రీమంతుల ముఖ్యలక్షణమైనటువంటి గర్వం ఉన్నాయి. నాకోసం నాచుట్టూ చాలామంది ఆడపిల్లలు తిరుగుతారని సగర్వంగా చెప్పుకోగలను. కాని నన్నెవరూ ఆకర్షించలేదు. నే నెనరివెంటా పడ్లేదు. కాని నా మనసులో ఏమూలనుంచో బలహీనమైన నా నిజాయితి పెద్ద కంఠంతో అరిచింది. "అబద్ధం. అందరి సంగతేమో కానీ కవితమాత్రం నీ వెంట పడలేదు. నిన్ను కోరలేదు. పైగా అసహ్యించుకుని చీదరించుకున్నా నీవే ఆమె కోసం "

"ఆపు! అధిక ప్రసంగం" నా అహం ఎదురు తిరిగింది.

వర్షం తుంపరలు ఎగిరి మొహంమీద పడ్డంతో నా చెంపలు వల్లబడుతున్నాయి ఇంతలో వెనగ్గా వెచ్చని రెండు మృదువైన చేతులు నా చెంప తాకి కళ్ళు మూసాయి. ఆ స్పర్శ నాకు చిరపరిచితమైనదే. చిన్నగా నవ్వుకుని "నీనా!" చేతులు తీస్తూ పిలిచాను.

నీనా ఎదురుగా నిలబడి చిఱునవ్వుతో అంది, "భలే గుర్తుపట్టేసేవే రాజీవ్!" ఏదో కమ్మని పరిమళం నన్ను చుట్టుముట్టింది. అది ఖరీదయిన సెంటు. నీనా ఇవాళ చాలా అందంగా అలంకరించుకుంది తీర్చిదిద్దిన కాటుక కళ్లు మిలమిలలాడుతున్నాయి. నల్లటి పలుచని జార్జెట్ చీర, దానిమీద పెద్దపెద్ద జరీపూలు, స్లీవ్ లెస్ జాకెట్టుల్లోంచి తెల్లని నీనా శరీరపు వంపులు చూసి అప్రయత్నంగా అన్నాను. "యు ఆర్ వెరీ స్మార్ట్ "

నీనా మెరుపులు కురిపించే కళ్ళతో చూస్తూ, గులాబీరంగు పెదాలను నెమ్మదిగా కదిలిస్తూ, "థాంక్యూ" అంది నవ్వాలని ప్రయత్నిస్తూ నీనా అందాన్ని మెచ్చుకుంది నా కళ్ళే, నా మనసు కాదు. తెలిసీ ఆమాట అన్నానంటే అది కేవలం సభ్యత కోసం. ఆడవాళ్ళను పొగడ్డంవల్ల వాళ్ళు మనకు మరింత సన్నిహితులవడమే కాకుండా మనల్ని ఇష్టపడతారు. ఈ స్వభావం నాకు నా చుట్టూ మెసిలే ఖరీదయిన ఆడవాళ్ళే నేర్పారు.

"రాజీవ్ ఏదో ఆలోచిస్తున్నావు." నీనా నా భుజంమీద చేయేసింది. నీనాలాంటి ఆడపిల్ల నాలాంటివాడిమీద చేయివేస్తే మనసులో ఆమెమీద చులకన భావం ఏర్పడవచ్చునని ఆమెకు తెలీదు.

"ఊఁ! నీ గురించే" తడుముకోకుండా జవాబిచ్చాను. ఫక్కున నవ్వింది. నన్ను పక్కకుతోసి విండో గ్లాసెస్ క్రిందకు దించి చేతికంటిన నీటితుంపరలు నా మీదకు విసురుతూ "వర్షాన్ని చూస్తే నీకు తిక్క ఆలోచనలు వస్తాయి" అంది వెక్కిరింతగా.

"నీ గురించి ఆలోచించడం కూడా తిక్క ఆలోచనేనా?"

"కాదూ! నీ మాటలు నే నమ్మలేనా? ఇక్కడుంటేనే ఆ కబుర్లన్నీ! కలకత్తా పోయి ఎన్ని లెటర్స్ రాసినా జవాబివ్వవు" బుంగమూతితో అంది నీనా.


"బుంగమూతి పెట్టకు. ముద్దొస్తున్నావు." చిలిపిగా నవ్వాను.

"ఏం లాభం. అపర ఋష్యశృంగుడివిగా" అంది చిరుకోపంతో

నేనేం మాట్లాడకుండా అలా ఉండిపోయాను

"రాజీవ్. అబ్బ—ఏమిటంత ఆలోచన. సరే తీరిగ్గా ఆలోచించుకో. నే క్రిందకు పోతున్నా" అంటూ నీనా చివుక్కున వెనక్కి తిరిగి వడివడిగా వెళ్ళిపోయింది. పిలుద్దామనిపించినా పిలువలేను. నా ఆలోచనలు నీనాకేసి మళ్ళాయి. నాలో ఉండే బలహీనతే ఇది. మనిషి ఎదురుగా ఉంటే సరిగ్గా మాట్లాడలేను. వారి పరోక్షంలో వారిని గురించే ఆలోచనలు మళ్ళుతాయి. నీనా కోపంగా వెళ్ళిపోయింది. నీనాను కోడలుగా చేసుకోవాలని నాన్న కోరిక. నీనాలో అందం, కోపం, గర్వం అన్నీ సమపాళ్ళలో ఉన్నాయి. అమ్మ "నీకు తలబిరుసులో నీనా సరిగ్గా సరిపోతుంది" అంటుంది అమ్మకూ నాన్నకు నా మనస్సేమిటో తెలీదు. అసలు నాకే సరిగ్గా తెలీదు. వాళ్ళెంత సేపూ డబ్బూ, అంతస్థూ చూసుకుంటారు. నాకు అన్నీ కావాలి. కాని నీనాలో ఏదో లేదు అదే, నన్నూ, నా మనసునూ ఆమె ఆలోచనలతో క్షణం సేపుకూడా స్పందించలేదు బాహ్య పొరలన్నిటికీ లోపల అతి మృదువైన మనసులో నీనా లేదు! నీనాను చేసుకుంటే భరించలేనంత లోటు గుండెల్ని పిండేస్తుంది. నా మనసులో నాకే తెలీని రెండు విరుద్ధభావాలున్నాయి నలుగురిలో ఉన్నప్పుడు నా హోదా, డబ్బూ చూసుకుని గర్వంగా తిరుగుతాను. ఒంటరిగా ఉండి నిర్మలంగా ఆలోచించే సమయాల్లో గుండెల్లో ఒకమూల కలుక్కుమంటుంది. దీనికంతా కారణం తనే! వాన జోరు హెచ్చింది అద్దంలోంచి తెరలు తెరలుగా కనబడుతోంది వర్షం. ఆ తెరల మాటున లీలగా ఆమె కవిత మొహం కన్పిస్తోంది. మనసు నిండా ఆలోచనలు ముసిరాయి. మెదడు తీవ్రంగా ఆలోచిస్తోంది

బాలయ్యరాక నా ఆలోచనలకు అంతరాయం కలిగించింది. క్రింద ఉన్న




మామయ్యవాళ్ళు నన్ను పిలుస్తున్నారనగానే గబగబా దిగి వెళ్ళిపోయాను. క్రింద నాకోసం ఎదురుచూస్తూ మా మమ్మీ, డాడీ కాక నీనావాళ్ళ మదర్, నీనా చెల్లెలు లీనా ఉన్నారు.

"అంకుల్ రాలేదా ఆంటీ" అంటూ నీనా వాళ్ళమ్మని పలుకరించాను. ఆవిడ మొహం వెడల్పు చేసుకుంటూ "త్వరగా వస్తానన్నారు. మమ్మల్ని ముందుగా పంపేసారు" అంది. నలుగురిలో పడేసరికి నాకు హుషారెక్కింది. చలాగ్గా మాట్లాడుతూ జోక్స్ విసురుతూ వాళ్ళల్లో కలిసిపోయాను. డిన్నర్ అనంతరం నేను అలవాటు ప్రకారం క్లబ్‌కు బయల్దేరాను. నాతో నీనా బయలుదేరింది. బయటికి వచ్చేసరికి అంతవరకూ బాగా పడిన వర్షం తగ్గిపోయి సన్నటి తుంపర్లు పడసాగింది. నేను గారేజ్‌లోంచి కారుతీసి నీనాకోసం ఎదురుచూస్తుండగానే పెద్ద కాలరున్న పుల్ స్వెటర్‌తో వచ్చింది నీనా. ఆమె గులాబిరంగు వంటిని ఆకుపచ్చటి స్వెట్టర్ కప్పేయడంచూస్తే ఆకులమాటున దాగిన గులాబి గుర్తొచ్చింది నాకు. కారు స్టార్ట్‌చేసి, అద్దాలు బిగించి, కారు స్లోచేసి నడపసాగాను. వర్షంరాత్రి, జనసంచారం లేని రోడ్డు, చలికాలం కావడంవల్ల మామూలుకంటె ఒక పెగ్ ఎక్కువ తీసుకున్నాను డిన్నర్ అనంతరం. అందుకే వళ్ళంతా హుషారుగా ఉంది. తుంపరలు పడటంకూడా క్రమేపి ఆగిపోవడంతో నావైపు విండోగ్లాస్ క్రిందకు దించేసాను. చల్లటిగాలి రివ్వున వీచింది.

"ష్‌! అబ్బ చలి. అది మూసేయ్‌ రాజీవ్‌" అంది నీనా.

"స్వెట్టర్‌లో ఉన్నావు మేడమ్‌. ఇంకా చలేనా?!"

"అదిగో మళ్ళీ వెక్కిరింతలు మొదలెట్టావు. ఇలా అయితే నీతో రాను" అంటూ బెదిరించింది.

"రమ్మని ఎవరడిగారో" అంటూ నీనాను రెచ్చగొట్టాను.

నీనా మొహం ఎర్రబారింది. మొహం ప్రక్కకు తిప్పుకుంది. నీనా మాట్లాడకుండా ఉండేసరికి నాకు నిజంగా జాలేసింది.

"నీనా! ఆ స్వెటర్‌ విప్పేయ్‌. ఏమిటది ముసలిదానిలా. ఆమాత్రం చలి కంట్రోలు చేసుకోలేవూ?"

నీనా నాకేసి తీక్షణంగా చూసింది. నేను చిన్నగా నవ్వేసరికి ఏమనుకుందో స్వెటర్‌ లాగి అవతల పడేసింది. మూతి ముడుచుకుంది. ఆ క్షణంలో నీనా చాలా అందంగా కన్పించింది. ఎడంచేత్తో ఆమెను పట్టుకున్నాను. మెత్తని వెచ్చని నీనా స్లీవ్‌లెస్‌ చేతులు నాకు తగిలాయి. నీనా చలించలేదు. ఒక్కసారి లాక్కుని ఆమె ఖాళీ నుదుటిమీద ముద్దెట్టుకున్నాను. నీనా పరవశించిపోయి నా గుండెల్లో తల దూరుస్తూ, "రాజీవ్‌, రేపేగా మన ఎంగేజ్‌మెంట్‌. డియర్‌, మనం త్వరగా మ్యారేజ్‌ చేసుకుందాం" అంది. ఆ మాటలకు నా ఆవేశం అంతా చప్పగా చల్లారిపోయింది. నన్ను కోరే ఆడవాళ్ళంటే నాకెందుకో చులకన. విండోగ్లాస్‌ పైకెత్తే నెపంతో నీనాను వదిలించుకుని కారు స్పీడుచేసి క్లబ్‌ను త్వరగా చేరుకున్నాము. నీనా మొహం ఆశ్చర్యంగా ఉండడం చూసీ చూడనట్టు ఉండిపోయాను.

మేము క్లబ్‌నుండి ఇంటికి వచ్చేసరికి పదిగంటలవుతోంది. నాన్న, మామయ్య గట్టిగా నవ్వుతూ మాట్లాడుకుంటూ కార్డ్స్‌ ఆడుతున్నారు. టేబిల్‌మీద సీసాపై తెల్లటి లైటుకాంతి పడి మెరుస్తోంది. నన్ను చూడగానే నాన్న మామయ్యతో చెప్పినట్టు ఉన్నారు. ఆయన తూలుతూ వచ్చి నన్ను కావలించుకుని, "హల్లో మై డియర్‌ యంగ్‌మాన్‌. హౌ ఆర్‌ యు" అంటూ పలుకరించాడు. ఆయన ఫుల్‌ డోసులో ఉన్నాడని తెలుసు. అందుకే చిన్నగా నవ్వేసి తప్పించుకున్నాను. నీనా లోపలికి వెళ్ళిపోయింది. సడన్‌గా నాన్న నా దగ్గరికి వచ్చి "రేపు నీ ఎంగేజ్‌మెంట్‌ డే గుర్తుందా. త్వరగా లేచేసేయి." అంటూ చెప్పేసి వెళ్ళిపోయారు. నేను మౌనంగా తలూపి పైకెళ్ళాను.

డన్‌లప్‌ బెడ్‌మీద ఎంతసేపు పొర్లినా నిద్ర రావడంలేదు. కళ్ళు మూసుకున్నా ఏవేవో దృశ్యాలు గజిబిజిగా కన్పిస్తున్నాయి. ఏవో రంగుల వలయాలు అలలలుగా చుట్టూ తిరుగుతున్నాయి. ఎంగేజ్‌మెంట్‌ రేపు. నాకు తెల్సు. కానీ నీనాను



యువ

పెళ్ళి చేసుకోగలనా? నా ఆస్తి, అంతస్థూ, హోదాకు నీనా బాగా సరిపోతుంది. మరి నా మనసుకో? దానికివేమీ అక్కరలేదు. ఎప్పటినుంచో చెరిగిపోక తన హృదయంలో ప్రతిష్ఠించుకుపోయిన అమ్మాయే కావాలి దానికి. కాని అది అసాధ్యం. నా మనసులో ఏవేవో దృశ్యాలు కదలిపోతోంటే, దానిలో గతం చూసుకుంటున్నాను.

* *

నేను బొంబేలో హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్న రోజులవి. హైదరాబాద్ లోనే చదవాలని నా కున్నా నాన్న ఒప్పుకోలేదు. అప్పుడాయన బిజినెస్ విషయమై ఫారిన్ వెళ్తూ అమ్మను తీసుకెళ్లారు. మధ్య, మధ్యలో పోవాల్సిన పని ఉంటుందని అందుకే నే నొక్కడ్నే ఇంటిలో ఉంటే ఏమైనా చెడిపోతానేమో అని భయపడి బొంబే హాస్టల్లో చేర్పించారు. అక్కడయితే నన్ను నా మంచి చెడ్డలు విచారించేందుకు మా స్వంత చిన్నాన్న ఉండడంతో ఆయనమీద నా బాధ్యత పెట్టారు నాన్న. నేను హాస్టల్లో ఉంటానికి చిన్నాన్న ముందు ఒప్పుకోలేదు. హాస్టల్లో వుంటే నలుగుర్నీచూసయి నా బాగా చదువుతానని కంపెనీ ఉంటుందనీ చెప్పారునాన్న. వచ్చిన కొత్తలో కాలేజీలో ఆడ మొగ తేడా లేకుండా కలుపుగోలుతనంగా ఉడడం చూసి నా కెంతో ముచ్చటవేసింది. మా చిన్నాన్న కూతురు రేఖ మా కాలేజీలోనే చదువుతోంది. నా కంటే ఒక సంవత్సరం జూనియర్. మేమిద్దరం చాలా సరదాగా ఉండేవాళ్ళం. పుట్టుకతో వచ్చిన అందానికి నా ధనంతో మరింత మెరుగులు దిద్దాను. నలుగురిలో పేరు తెచ్చుకునేందుకు డబ్బు వెదజల్లేవాడిని. డబ్బనేది ఎక్కువగా ఎక్కడుంటుందో అక్కడే మనిషికి ఎక్కువ ఆకర్షణ ఏర్పడుతుంది. అతి త్వరలోనే కాలేజీలో నేను కొంత "ఇన్‌ఫ్లుయెన్స్" సంపాదించుకోగలిగాను. వీటికితోడు నేను ప్రతీ స్పోర్ట్స్‌లో ఉండేవాడ్ని. ఎందుకంటే స్పోర్ట్స్ నా ఆరో ప్రాణం. నేను మరీ ఛాంపియన్‌కాకున్నా నేనూ ఆటగాడ్నే అని కొన్ని సర్టిఫికెట్స్ సంపాదించుకోగల్గాను. ఇక్కడ కాలేజీలో చదువుకున్నా ఇతర ఆక్టివిటీస్ మీద ఇంట్రస్ట్ ఎక్కువ. ఆడపిల్లల్ని ఆకర్షించుకోడానికి నాకు ఎక్కువ క్వాలిఫికేషన్స్ ఉన్నట్టున్నాయి. అందుకే సరూ, గీత, కౌముది, రేఖ వీళ్ళంతా నే నంటే పడిచచ్చేవాళ్ళు.

నేను ప్రతి ఆదివారం చౌపతీలో ఉండే మా చిన్నాన్న ఇంటికి పోయేవాడ్ని. ఒక ఆదివారం నేను వాళ్ళింటికి పోయే సరికి ఇంట్లో ఎవరూ లేనట్లు నిశ్శబ్దంగా ఉంది. హాలంతా ఖాళీగా ఉంది. రేఖ రూంలోకి వెళ్ళాను. గుమ్మానికి వీపుపెట్టి కుర్చీలో కూర్చుని పేపరు సీరియస్‌గా చదువుతోంది రేఖ. పక్కన్నే "లో

వాల్యూమ్''లో రేడియోలో తీయగా లలిత గొంతు వినిపిస్తోంది. రేఖను ఒక్కసారి హడలుగొట్టాలి అని కాన్వాస్ షూస్‌తో నెమ్మదిగా నడిచి రేఖ భుజంమీద ధనా అని కొట్టాను. హఠాత్తుగా వెనక్కి తిరిగిన ఆ అమ్మాయి రేఖ కాదు. ''మైగాడ్!' అనుకున్నా. రేఖకు అంత పెద్ద కళ్ళు లేవు. రేఖ ముక్కు యింత నాజూగ్గాలేదు. రేఖ పెదాలు ఇలా తీర్చి దిద్దినట్టులేవు. కళ్ళు పెద్దవిచేసి నాకేసి కోపంగా, నన్ను మింగేద్దామనేటంత కోపంగా చూస్తూ నిలబడ్డ ఆ అమ్మాయిని చూసి ''సా....సారీ. మా రేఖ అనుకున్నాను'' నా గొంతులో మాట పూడి రావడంతో గట్టిగా నవ్వుతూ రేఖ లోపల్నుంచి వచ్చింది. ఆ అమ్మాయి మొహం ఎర్రగా చేసుకుని చరచరా వెళ్ళిపోయింది. రేఖ ఆ పిల్ల వెంట ''కవితా... కవితా' అంటూ పరుగెత్తింది. నేను పిరసంగా కూలబడ్డాను. ఎంత పని జరిగింది. ఒక్కోసారి అనుకోకుండా పొరపాట్లు జరుగుతాయి. నేను సారీ చెప్పినా ఆ అమ్మాయి కోపం పోలేదే? అనుకుంటూ కూర్చున్నాను. అదే కవితతో పరిచయం కలగడం. ఇంతలో రేఖ లోపలికి వచ్చి ''ఏమిటిరాజీ, నీ పనులన్నీ ఇంతే! అలా చూసుకోకుండా ప్రవర్తిస్తే తనేమనుకుంటుంది?'' అంది ఉరు కోపంగా.

''అ! పొరపాటయింది. సారీ చెప్పాగా'' అన్నాను తేలిగ్గా ఎగ్గొట్టేస్తూ.


''ఆహా! సారీ చెప్తే అయిపోయిందేమిటి. మీ గీత, కౌముది వాళ్ళలాగా నీవు పలకరిస్తేనే చాలు అనుకునే మనిషనుకున్నావా?''

''అబ్బో! చాలా ప్రౌడిఫ్ గర్ల్ అన్న మాట. ఏం? గవర్నర్ ఓన్లీ డాటరా?'' వెక్కిరింపుగా అన్నాను.

''వాళ్ళనాన్నగారూ కాదు. కవిత డాటరూ కాదు. తనకి తండ్రిలేడు. వాళ్లది చాలా సామాన్యమైన కుటుంబం. మన కాలేజీలోనే చదువుతుంది. తను నా క్లాస్‌మేట్. కవిత వాళ్ళ మామయ్య ఇక్కడ చిన్న ఉద్యోగంలో వుంటున్నాడు. ఎక్కడా తోడులేక కవితా, వాళ్ళమ్మ వాళ్ళ నాశ్రయించారట. తనసలు ఎప్పుడూ మనింటికిరాలేదు. నేను చాలా బలవంతం మీద తీసుకొచ్చా. తీరా తీసుకొచ్చాక నీవేమో అంతా పాడుచేశావు.''

''ఆహా! ఏం ఫ్రెండ్‌షిప్. ఏమిటి? నే నిలా అంటున్నానని ఏమనుకోకు. ఆ అమ్మాయి ఫ్రెండ్‌షిప్ మానేయి. ఈ మిడిల్‌క్లాస్‌వాళ్ళున్నారే వాళ్ళు ఎంతసేపూ ఇంట్లో డబ్బు యిబ్బందుల గురించే మాట్లాడతారు. వాళ్లు మనసు మంచి కంపెనీగా ఉండరు.''

''ఛ. రాజీవ్! సిల్లీగా మాట్లాడకు. కవితను నీవేమన్నా అంటే నాకు బాధ వేస్తుంది తను చాలా మంచిది డబ్బుని చూసి ఫ్రెండ్‌షిప్ చేసేటంత నీచస్థితికి




దిగజారలేను నేను. ఆ అమ్మాయి కాలేజీలో ఎంత రిజర్వ్‌డ్‌గా ఉంటుందో నీకు తెలుసా. మీ గర్ల్‌ఫ్రెండ్స్‌లాగా ఎన్నడూ వెకిలిగా ప్రవర్తించదు. అందుకే తనంటే మీ బాయిస్‌లో చాలామందికి మంచి ఇంప్రెషన్ ఉంది.''

''ఓహ్! ఏమిటో ఆ అమ్మాయిలోని ప్రత్యేకత?

''బోలెడంత ప్రత్యేకత ఉంది. తనతో ఫ్రెండ్‌షిప్‌చేయి తెలుస్తుంది తనెంత మంచి కంపెనీ ఇస్తుందో కూడా అర్థమవుతుంది. పైగా కవిత మన తెలుగుదే!''

''ఛ! ఛ! ఎవరితోపడితే వాళ్ళతో నాకు ఫ్రెండ్‌షిప్ ఏమిటి?'' నేను దర్పంగా చెప్పాను. ''నా గురించి తెలిస్తే తనే వెంటబడ్తుంది.''

రేఖ పకపకా నవ్వింది. ''కవితను సామాన్యంగా అంచనా వేసుకోకు. తను దేనికీ లొంగదు. కూర్చో కాఫీతెస్తా'' అంటూ లోపలికి పోయింది రేఖ. నా మనసులో అనుకోకుండా రెండు విశాల నేత్రాలు, నాజూకైన ముక్కు, తీర్చిదిద్దిన పెదాలు కలిగిన మొహం మెదిలింది. రేఖ కాఫీ తెచ్చింది. కవిత గురించి ఇంకా అడగాలనుకున్న మనసుకు కళ్ళెంవేసి ఏదో సంభాషణలోకి దిగాను.

ఆ తరువాత కవితను కాలేజీలో చూసాను. నలుగురిలోవున్నా కవిత ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఏపుగా వాలు జడ, తీక్షణమైన చూపులు, అందమైన నవ్వు, హుందానడక కవిత ప్రత్యేకాకర్షణలు. తూచి తూచి మాట్లాడుతుంది. ఆమె మొహంలో కళ ఆ హుందా చూసి ఎవరైనా ధనవంతురాలేమో అని భ్రమ

పడతారు. పైకి సాధారణంగా కనిపించే కవిత గురించి ఆమెకు సన్నిహితంగా పోయినవాళ్లకు తప్ప తెలీదు. వాళ్లు బహు కొద్దిమంది. వాళ్లల్లో నా రూమ్మేటు శంకర్ ఒకడు కవితవాళ్ళకి దూరపు బంధువు. నేను ఎలక్షన్స్‌లో నిలబడ్డప్పుడు అతని సహాయం లభించింది నాకు—

ఆరోజు

లేడీస్ వెయిటింగ్ రూం దగ్గరికి నన్ను తీసుకుని శంకర్ వెళ్ళి కవితను పిల్చాడు.

మస్టడ్ కలర్‌చీర, మ్యాచింగ్ జాకెట్టు వేసుకుంది చెవుల్లో తళతళ్లాడే రింగులు తప్ప మరే ఆభరణాలు లేవు. రెండుజడలు వేసుకుంది. నావేపు చూడకుండానే శంకర్‌తో మాట్లాడుతోంది నవ్వుతూ. కవితను పరీక్షగా చూసేకొద్దీ నాలో ఏదో అలజడి మొదలయింది. నేనెందరినో అందమైన ఆడపిల్లలను చూసాను కాని కవిత అందం వేరు ఇన్నాళ్ళూ అలంకరణ అనే ఆ సంబరములో అందం చూసానుకాని నిరాడంబరతతో ఇంత అందం ఉందని కవితను చూసే తెలుసుకున్నాను. శంకర్ నన్ను పరిచయం చేయగానే అప్పుడే చూసినట్టుగా చూసి కొంచెం మొహం ముడుచుకుంది. లేడీస్ ఓట్లన్నీ నాకే ఇవ్వాలని నా తరఫున కాన్వాస్ చేయాలని కోరాను. కవిత చిన్నగా చెప్పింది. "సారీ. ముందే మీ ఆపోజ్ వాళ్ళకి మాటిచ్చేసాను."

ఒక్కసారి నామొహం మీద చన్నీళ్లు కొట్టినట్టయింది నేనుకోరకముందే ఈ పని చేయడం కోసం చాలామంది ఆడపిల్లలు నన్నడిగారు. నేనువచ్చి మాట్లాడ్డమే గొప్పగా భావిస్తారు కొందరు. అటువంటిది ఆఫ్టరాల్ ఈ కవిత నేనడిగితే తిరస్కరిస్తుందా? నాకు బాగా కోపం వచ్చినా బలవంతంగా అణచుకుని "యు ప్లీజ్ ట్రై" అనేసి వెనక్కి వచ్చేసాను.

ఎలక్షన్స్‌లో బాగా ఖర్చుపెట్టడంతో నేననుకున్న దానికంటె ఎక్కువ మెజారిటీతో "జనరల్ సెక్రెటరీ"గా ఎలెక్టు అయ్యాను. అందరికీ థాంక్స్ చెప్పుకోవడమే కాకుండా నాకు కాన్వాస్ చేసిన వాళ్ళందరికీ గ్రాండ్ పార్టీ అరేంజ్ చేసాను కవితను పార్టీకి అందరితో బాటు ఆహ్వానించినా ఆమెరాలేదు. ఎలక్షన్స్‌లో గెలవడంతో క్షణంకూడా తీరిక లేకుండా పోయింది ఎప్పుడూ బిజీగా ఉండేవాడ్ని. హాస్టల్‌లో ఉండడంకూడా తక్కువే. ఒకరోజు ఫ్రెండ్ కారులో పోతున్నాను. వాడుకూడా హైద్రాబాదులో నా క్లాస్‌మేట్. కాలేజీనుంచి రేఖ, కవిత కలిసి బయటికి వస్తారు. రేఖను చూడగానే కారు ఆపించాను. లిఫ్ట్ ఇవ్వగానే ఇద్దరూ వెనక సీట్లో కూర్చున్నారు.

"ఏం రేఖా? ఈవాళ కారురాలేదా?" అనడిగాను వెనక్కితిరిగి

"లేదు. నాన్న పనిమీద కారు తీసుకు

పోయారు. బస్‌లో పోదాం అనుకుం టూండగా ఆపద్బాంధవుడిలా వచ్చావు. అదిసరే. ఈ మధ్య నీవసలు కనబడ్డం లేదని నాన్న అడిగారు.'' అందిరేఖ.

''సారీ రేఖా రోజూ అనుకుంటూనే ఉన్నా వద్దామని తీరికలేదు.''

''నీవు ఎలక్షన్స్‌లో ఓడిపోయినా బాగుండేది'' జోక్ చేసింది రేఖ.

''ఏదో మీదయవల్ల గెలిచాను.''

''అబ్బ. దేశనాయకుల లక్షణాలు మొదలయ్యాయే ' అంటూ వెక్కిరిం చింది. నేను నవ్వేసాను. రేఖ ప్రక్కన కూర్చున్న కవిత మౌనంగా బయటికి చూస్తోంది ''ఈ పిల్లకు ఏమీ లేకున్నా చాలాగర్వం'' అనుకున్నా మనసులో.

''మిస్‌కవితా. మెనీథాంక్స్. చెప్పడం మర్చిపోయాను. అన్నట్టు మీరారోజు పార్టీకి రాలేదేం?''

''మీరు పార్టీ ఎందుకిచ్చారు?'' సీరియస్‌గా అడిగింది కవిత.

''ఎందుకేమిటి. ఎలక్షన్‌లో నాకు హెల్ప్ చేసిన వాళ్ళందరికీ ఒకపార్టీ అన్నా ఇవ్వకుంటే బాగుంటుందా?''

''మరి నన్నెందుకు ఇన్‌వైట్ చేసారు?''

''ఎందుకేమిటి మీ ఓట్లు నాకిచ్చి నందుకు.''

''సారీ మా ఓట్లు మీకువేయలేదు.'' కవిత చెప్పగానే డ్రైవ్ చేస్తున్న నా ఫ్రెండ్, రేఖ ఫక్కున నవ్వారు. నేను మొహం చిన్నబుచ్చుకున్నాను. కవితను ఈవాళ వదలకూడదు. తనెందుకు ఓటు ఇవ్వలేదో తేల్చుకుందామనుకుని అడి గాను. ''మీరు జోక్ చేస్తున్నారు'' అన్నాను. నాకెందుకో కవిత నాకుతప్ప ఎవరికీ ఓటు వేయదనిపించింది.

''కాదు. నిజంగానే మీకు ఓటువేయ లేదు. అందుకే మీ పార్టీకి కూడా రాలేదు.''

మీకుఓటు ఇవ్వలేదనడంలో ''మీకు అర్హత లేదనే'' అర్థం ధ్వనించింది.

''ఓహో. అపర హరిశ్చంద్రులన్న మాట ఆడినమాట తప్పకుండా ముందడి గిన వాళ్ళకే వేసారు.'' వ్యంగ్యంగా అన్నాను కోపంకొద్దీ! కాని కవిత జవాబు చెప్పకుండా బయటికి చూస్తూండి పోయింది. నా అభిమానం దెబ్బతింది. చివుక్కున తలతిప్పకుని సరిగ్గా కూర్చు న్నాను. ఈ కవిత గర్వం ఎలా అణ చాలని ఆలోచిస్తూండి పోయాను. మధ్యలో వాళ్ళిద్దరూ దిగి వెళ్ళిపోయారు. ఎన్నడూ లేనిది ఆరోజంతా అనుకో కుండా కవిత ఆలోచనలో గడిపేసాను.

నెలరోజులనంతరం రేఖ నన్ను పిలిచి ఆరోజు తన బర్త్‌డే ఉందని సాయంత్రం పార్టీకి రమ్మని ఆహ్వానిం చింది తప్పనిసరిగా పోవాలి. ఆరోజే నాన్న బిజినెస్‌మీద వచ్చి నన్ను కలుసు కుని ఎవరింటికో తీసుకెళ్లారు. అటు ఇటూ తిరగడంతో రెండుగంటలు లేట

ఱింది. అప్పటికే చీకటి పడిపోయింది. నా మనసులో రేఖ కంటె కవిత ఎక్కువ మెదలుతోంది. కవిత ముందు రేఖకు మంచి ప్రెజంటేషన్ ఇవ్వాలి అనే ఆలోచనే నన్ను ఖరీదయిన రింగ్ కొనిచ్చింది. ట్రిమ్‌గా తయారయి రేఖ వాళ్ళింటికి బయల్దేరాను. నేను వెళ్ళేసరికి పార్టీ అయిపోయింది. చాలా కమ్మటిపాట నా చెవుల సోకుతోంది. హిందీ వాతావరణంలో చక్కటి జయదేవుని అష్టపది. రేఖ వాళ్ళ వరండాలో నిలబడి లోపలికి చూసాను చాలామంది కాలేజీ అమ్మాయిలు గుంపుగా కూర్చున్నారు. కళ్లువాల్చి పాడుతోంది కవిత. నీలంరంగు వాయిల్ చీరకు అరచేయి వెడల్పున పసుపురంగు బార్డర్ ఉంది. ఆ చీర బార్డర్ రంగు జాకెట్టు వేసుకొంది, వదులుగా వేసుకున్న జడలోంచి విరిసిన గులాబీ తొంగిచూస్తోంది. కవిత నునుపైన శరీరం పైన ట్యూబ్‌లైట్ల వెలుగులు పడి చెదరిపోతున్నాయి. కవితని అలా చూస్తుంటే నా మనసులో ఎన్నో అనుభూతులు కలిగాయి. కవిత అందం నన్ను పరవశుడ్ని చేస్తోంది. నా చెవులు ఆమె పాటకు, కళ్లు ఆమెను చూడ్డానికి అప్పగించాను. నా మనసులో ఆమెస్థానం నాకు తెలీకుండానే అధిక మయింది!

పాట పూర్తి కాకుండానే లోపలికి అడుగుపెట్టాను అంతే! ఠక్కున పాట ఆగిపోయింది. కవిత కళ్ళూ నా కళ్ళూ కలుసుకున్నాయి. ఆమె మొహం ఎర్రబడింది. రేఖ పరుగెత్తుకుంటూ నా దగ్గరకి వచ్చింది. నన్ను చూడగానే అమ్మాయిలలో సంచలనం కలిగింది. నేనెందుకు లేట్‌గా వచ్చానని అందరూ అడగడమే కానీ ఒక్కరూ ఆగిపోయిన పాటను పాడమని అడగలేదు. వీళ్ళందరికీ నే నొస్తున్నానని తెలిసేవచ్చారని గ్రహించి చిన్నగా నవ్వుకున్నాను. ఈ సమయం వదలకూడదు. అందుకే కవితతో పాడమని చెప్తామనుకున్న నాకు కవిత నిర్లక్ష్యం గుర్తొచ్చి కవితకేసి చూడనైనా చూడకుండా రేఖకు ప్రెజంటేషన్ ఇచ్చి అమ్మాయిలతో మాటల్లో పడ్డాను. రేఖ కవిత దగ్గరకి వెళ్ళి పాడమంది కాని కవిత తల అడ్డంగా వూపడం చూసి, చూడనట్టు వుండిపోయాను.

రేఖ టిఫిన్ సప్లయ్ చేయడంతో తింటూ కబుర్లలో పడ్డాను. అతి అలంకరణలతో, మాటకారి తనంతో, మత్తెక్కించే సువాసనలతో, ఛలోక్తులతో ఉన్న మా కాలేజీ అమ్మాయిల మధ్య వూపిరాడలేదు నాకు. మధ్యలో కవితకోసం నా కళ్ళు వెదికాయి. ఆమె ఎక్కడా లేదు! రేఖ దగ్గరికి వెళ్ళి అడిగాను.

"కవిత మధ్యలో పాట ఆపేసిందేం?"

"నిన్ను చూసి."

"ఏం? నేనేమన్నా రాక్షసుడ్నా?"

కోపంగా అడిగాను.

"ఏమో? అది మీ రిద్దరూ తేల్చుకోండి" రేఖ నవ్వుతూ అంది.


"ఇంతకీ తనేది?"

"నిజంగా నీవు పోట్లాటకొస్తావేమో నని భయపడి ఇంటికి పారిపోయింది." రేఖ నవ్వుతూంటే నాకు వళ్లు మండిపోయింది. మా సంభాషణ అర్థంకాని అమ్మాయిలు హిందీలో మాట్లాడుకుంటున్నారు.

"సరే. నేనూ వెళ్ళాలి. నాన్న వచ్చారు పూర్నించి. అర్జెంట్ పనుందంట నిన్ను చూసి ఒన్‌మినిట్‌లో వస్తానని చెప్పివచ్చాను"

రేఖ ఎంత బలవంత పెట్టినా విన కుండా బయటికివచ్చేసి టాక్సీలో కూలబడ్డాను. కవిత సంగతి చెప్పగానే నే నిలావచ్చేయడాన్ని రేఖ మరోవిధంగా వూహించుకోవచ్చు అనే ఆలోచన తీరిగ్గా ఇప్పుడు కలుగుతోంది. వాచ్‌లో టైమ్ తొమ్మిదికావస్తోంది. దారిలో కవిత చకచకా నడుచుకుంటూ వెళ్ళిపోతోంది. టాక్సీ ఆపించి డోర్ తెరిచి "ప్లీజ్! కమిన్ కవితా" అన్నాను. నన్నేశక్తి అలాప్రేరేపించిందో నాకే తెలీదు. నన్ను చూడగానే కవిత ఉలిక్కిపడింది

"మీ మీరా! పరవాలేదు. నే పోగలను" అంది పెదవి బిగబట్టి. వెన్నెల్లో కవిత క్రొంగొత్త అందాన్ని సంతరించుకొంటోంది. నున్నటి ఆమె చెంపలను



తాకే అదృష్టం వెన్నెలకే కలిగినందుకు కొంత ఈర్ష్యపడ్డాను.''

''కాదు రేఖ చెప్పింది, మిమ్మల్ని డ్రాప్ చేయమని ఈ చీకట్లో ఎలా పోతారు? అవసరం కొద్దీ అబద్ధమాడాను. ఈ రేఖ వుత్త ఇడియట్. కవిత నొక్క దాన్ని ఎలా పంపింది?''

చీకటికి భయపడ్డట్టుగా కవిత మౌనంగా టాక్సీ ఎక్కింది, నేను సంతృప్తిగా ఫీలయినా, రేఖ చెప్పిందంటే తప్ప నా మాటకు విలువ నీయలేదు కదా అని పించింది.

''పార్టీ నుంచి అప్పుడే వెళ్ళి పోతున్నారేం?''

''పనుంది'' క్లుప్తంగా జవాబిచ్చింది.

''చాలా చక్కగా పాడారు. కానీ హఠాత్తుగా నేను రావడంతో ఆపేశారు కదూ. నేను మీపాట వినకూడదా?'' నా గొంతు నాకే చిత్రంగా ధ్వనించింది.

నే నూహించినట్లు కవిత చిఱునవ్వు నవ్వలేదు. కనీసం నాకేసి చూడనూ లేదు. మౌనంగా ఉండిపోయింది. జవాబు చెప్పడం ఇష్టం లేనట్లు నాకు ఆశాభంగం కలిగింది. కవిత ఒకచోట దిగిపోతూ నన్ను చూసీ చూడకుండా ''థాంక్స్'' చెప్పి పరుగు నడకలతో చీకట్లో కలిసి పోయింది. ఇన్నాళ్ళలా కవితను అంద రిలా చూడలేక పోతున్నాను. నాకు తెలీ కుండానే నా మనసులో ఆమె ఓ ప్రత్యేక స్థానం ఆక్రమించు కుందేమా అన్పించేది ఒక్కక్షణం.

మరుసటిరోజు సాయంత్రం నాకు మా చిన్నాన్నతో పనుంది రేఖ వాళ్ళిం టికి పోయాను. ఇంట్లో పిన్నమ్మతో మాట్లాడితే చిన్నాన్న అప్పుడే బయటికి వెళ్ళారని చెప్పింది. మేడపైన రేఖ ఉందంటే చకచకా పైకెళ్ళాను. కానీ అక్కడనుండి వచ్చేమాటలు నా కాళ్ళకు బ్రేకు లేసాయి.

''కవితా నీవెన్ని సాకులు చెప్పినా నానుంచి తప్పించుకో లేవు. నిజం నే చెప్తా విను నీవలా సడన్‌గా వెళ్ళిపోవ డానికి కారణం రాజీవ్ అవునా? నీ మూడ్స్ అన్నీ అతన్ని చూడగానే పాడయిపోతాయి. ఎందుకని యూష్చ యల్లీ యుహేట్ హిమ్.''

''రేఖా నామనసు చదివినట్టు చెప్తు న్నావే. నీకు పి హెచ్ డి ఇవ్వచ్చు'' చిన్నగా నవ్వుతూ అంది కవిత.

నా మనసులో ఒక్కసారి పిడుగు పడ్డట్టయింది. నన్ను కవిత హేట్ చేస్తోందా? అందుకా నానుంచి తప్పించుకు తిరుగుతోంది. నేనేం చేసాను తనను? నా వూపిరి బుసలుకొడ్తోంది. గుండెల్లోంచి నరనరంలో పట్టలేని ఆవేశం, కోపం ప్రాకి పోతోంది. చెవుల్లో సంభాషణ దూరుతోంది.

''కవితా! రాజీవ్ నీ వనుకున్నంత చెడ్డవాడుకాదు. ఎప్పుడు జాలీగా ఉంటాడు. అసలు తన స్నేహంకోసం ఎందరు

పూసుకు తిరుగుతున్నారో నీకు తెలీదు.''

''కావచ్చు రేఖా! కాని అందర్నీ తన వెంట తిరిగే వారిలా తలుస్తే ఎలా?'' ఇక నాకక్కడ నిలవబుద్ధి కాలేదు. స్టుపిడ్ కవితా! అనుకుని గిర్రున వెనక్కు తిరిగి వెళ్ళిపోయాను ఆరాత్రంతా పిచ్చివాడిలా ఆలోచించాను ఎన్నడూ లేనిది ఈ రోజు నేను ఇన్సల్ట్ అయినట్లు ఫీలయ్యాను. నాకు కావలసిందే' ఆమె రూపు, నడవడి నాలో ఆలోచనలు రేకెత్తించి మానసికంగా సాన్నిహిత్యం ఏర్పరచాయి. అనుకోకుండా కాలేజీలో ఆమె ఎదురయినపుడు గుండెల్లోకి చూసే ఆ చూపు నన్ను తికమక పెట్టి మరి దేన్నిగురించీ ఆలోచింప నిచ్చేదికాదు. అందరిలా కవిత నా వెంటబడి ఉండినా, నాస్నేహంకోసం తహతహ లాడినా ఆమెను పట్టించుకునే వాడ్నికాను. ''ఏమీలేని ఈమెకు ఏమి చూసుకుని గర్వం? అది గర్వంకాదు ఆత్మాభిమానం దానికే నీవు లోబడ్డావు'' అంది నా మనసు. నిజమే నేమో! కాని నాపట్ల ఇంతద్వేషం చూపే ఈ పిల్లకు నేనే అపకారం చేయలేదే? బహుశ మొదటిరోజు మా పరిచయం ఇంకా మర్చిపోలేదు కాబోలు. సరె! కవితా! నీవల్ల నా మంచితనం అనే ముసుగు జారిపోయింది, రేపట్నించి నా నిజ స్వరూపమే చూస్తావు, ఇంకా ఇంకా నన్ను ద్వేషిస్తావు

మరుసటిరోజు నేను ఒక పెద్ద గ్యాంగును పోగుచేసి నే నున్నప్పుడు కవితను బాగా ఏడ్పించమని ప్రోత్సహించాను. నేనన్నా, నామాటన్నా చాలామందికి వేద వాక్కు. ఆరోజునుంచి రేఖ, కవితల వెనక బాడీగార్డ్సు తయారయ్యారు కాని వాళ్ళు కవితనే ఏడ్పించే వాళ్ళు. ఒకరోజు కావాలని వాళ్ళిద్దరూ వచ్చేటప్పుడు రేఖతో పని వున్న వాడిలా పోయి ఏదోమాట్లాడుతూండగా పదిమంది మా ప్రక్కగా పోతూ ఎర్ర చీరకట్టుకుని మా పక్కన నిలబడ్డ కవితను చూసి ''లాల్‌ఛడీ! మైదాన్‌ఖడీ క్యాఖూబ్‌లడీ ''అంటూ ఒకడు కీచు గొంతుతో అరిస్తే మరొకడు కెవ్వుమంటూ పాడాడు. అందరూ గొల్లున నవ్వుకుంటూ పోయారు. ''స్టుపిడ్స్. వీళ్ళెందుకో ఈ మధ్య మావెంట తెగ పడ్తున్నారు రాజీవ్'' అంది రేఖ — నేను ఓరగా కవితకేసి చూశాను. ఎర్రటి చీర నీడో, లేక వేగంగా రక్తం ప్రసరించడం వల్లనో ఆమె మొహం అరుణిమను దాల్చింది.

''కొందరికి కొందరిని చూస్తే టీజ్ చేయ బుద్ధి అవుతుంది. దానికి ఏవరేం చేస్తారు?'' కవితవంక చూసి నవ్వి విర్లక్ష్యంగా వెళ్ళిపోయాను. నాముందు అవమానం పొందిన కవితను తల్చుకుని సంతోషపడ్డాను. ఆమె నప్పుడే వదలకూడదు కళ్ళల్లో నీళ్ళు చూడాలి. నా ముందు తను ఏడుస్తూ నాసహాయం కోరితే చాలు కవితను వదలివెట్టేస్తాను

అనుకున్నా. మరో రోజు ఎవరో రాసి నట్లుగా కవితపేరున ప్రేమలేఖ పంపాను కవిత ప్రిన్సిపాల్‌కు రిపోర్టు చేసింది స్టూడెంట్స్ లీడరయిన నన్ను పిలిపించి ప్రిన్స్‌పాల్ ఆ ఉత్తరం ఇచ్చి ఇది ఏ స్టూడెంట్ రాసిందో కనుక్కొని చెప్ప మన్నారు నేను అది చదివి ఎగతాళిగా కవితకేసి చూసి నవ్వాను బయటికి రాగానే కవిత చటుక్కున దాన్ని నా చేతి లోంచి లాక్కొని పత్రుర చింపి ముక్కలు చేసి అవతల పడేసి వెళ్ళబోయింది నేను ఆశ్చర్యపోతూ నిలబడి "అదేమిటి? దీన్ని ఎవరు రాసారో కనుక్కోవద్దా?" అనడి గాను "అక్ఖరలేదు అది ఎవరు రాసింది నాకు తెల్సు అనవసర గొడవలు నాకిష్టం లేదు" అంది


"ఎవరో తెలిస్తే ఇంకేం వాళ్ళని పట్టు కుని ప్రిన్స్‌పాల్‌కు రిపోర్టు ఇవ్వచ్చుగా?" వెటకారంగా అడిగాను

కవిత మరోసారి నేనూహించని విధంగా నాకళ్ళల్లోకి చూసింది ఆ కళ్ళ వెనకాల దాగిన సంక్షోభం కన్నీటి రూపంలో వలయాలు తిరుగుతోంది ఆమె నవ్వింది కాని చాలా నిరాశగా, నిర్జీ వంగా నవ్వింది ఆ చూపు ఆ నవ్వు నా కరకు గుండె వొక్కసారి వూపింది!

"అంత అవసరంలేదు" చటుక్కున మొహం తిప్పుకొని చరచరా వెళ్ళి పోయింది కవిత కోపంగా వెళ్ళిపో తోంటే నేనలాగే నిలబడిపోయాను. నా మనసులో ఏదో అర్థంకాని ఆరాటం మొదలయింది అది నేరాసిందని కవిత గ్రహించినట్టుంది మరి నేనని తెలిసాక నామీదెందుకు రిపోర్టు ఇవ్వలేదు ఇది జవాబు దొరకని ప్రశ్నగా నిలచిపోయింది నాలో!

నేనిలా కవిత వెనుకపడి అల్లరి చేయడం ఎవరైనా పసిగడ్తే నాస్టేటస్‌కు భంగం కలగవచ్చు. అల్లరి మితిమీరితే నలుగురికీ తెలిసే ప్రమాదముంది అందుకే అల్లరి మానేయాలని నిశ్చయించుకున్నా

ఒకరోజు రేఖ వాళ్ళింటికి కాలేజీ బస్ లోనే బయల్దేరాను (కాలేజి బస్ అంటే ఆ టైమ్‌కు బస్‌నిండా మా స్టూడెంట్స్ ఉంటారు) ఆరోజు రేఖ రాలేదు బస్ ఫుల్ రష్‌తో ఉంది కొందరు పరుగెత్తు కుంటూ బస్ అందుకొంటున్నారు వాళ్ళలో కవిత ఉండడంతో నేను కొంత ఆసక్తితో ఫుట్‌బోర్డు దగ్గరగా నిలబడ్డా. కవిత బస్‌లో కాలుపెట్టడమూ బస్ బయ ల్దేరడమూ ఒకే క్షణంలో జరగడంతో బాలెన్స్ తప్పి క్రిందకు పడబోయింది వెనకనే ఉన్న నేను చటుక్కున ఆమెను పట్టుకున్నాను కవిత కెవ్వుమంది చాలా జతల కళ్లు మాకేసి తిరిగాయి కవిత "స్టుపిడ్" అంటూ చివుక్కున వెను దిరిగి చేయెత్తింది నేను మెరుపులా ఆ చేయిపట్టుకుని గట్టిగా నొక్కాను నాకేసి పరిక్షగా చూసిన కవిత మొహం పాలి పోయింది. మౌనంగా బాధ ననుభవించి




చేయి విడిపించుకోవాలని చూసింది.

'ప్లీజ్! బికేర్‌ఫుల్ ఇన్‌యూజింగ్ వర్డ్స్ మేడమ్'' అనేసి వదిలేసాను అప్పటికే స్టూడెంట్స్ అంతా ఇకిలిస్తున్నారు ఎవరికీ నన్నేమనే ధైర్యం లేదు. నెక్స్ట్ స్టాప్‌లో ఆమె దిగిపోయింది అనవసరంగా కవిత బస్‌లో అల్లరి పడిందే అనే బాధ కల్గింది నాలో, రేఖా వాళ్ళింటికి పో బుద్ధి కాక వెనుదిరిగాను

ఆరోజంతా నా మనసు మనసులో లేదు తనకోసం నేనెందుకు బాధపడాలి ఇదెక్కడి కొత్త అనుభూతి నాకు వెళ్ళి కవితను క్షమాపణ అడిగితే? ఛ! తనెంత దిగజారిపోయాడు తప్పు ఆమెదైతే నేను క్షమాపణ అడగడం ఏమిటి? ఉండలేక వేడెక్కిన తలను చల్లబర్చుకోడానికి ఒక్కణ్ణే బీచ్‌కు బయల్దేరాను

సముద్రుడి చల్లని గాలులు శరీరాన్ని తప్ప మనసును చల్లబరచడం లేదు ఇసుకలో కూలబడ్డాను బీచ్ జన సమర్ధంగా వుంది వెన్నెల నీళ్ళలో తళతళలాడుతోంది. దూరంగా రేఖ, చిన్నాన్న కనబడ్డారు ''ఏం? గాలి ఇటుమళ్ళిందే? ' రేఖ నవ్వుతూ నా దగ్గరికి వచ్చింది చిన్నాన్న ఎవరో తెలిసిన వాళ్ళు కన్పిస్తే మాట్లాడుతున్నారు,

''మనసు బాగాలేదు రేఖా'' అప్రయత్నంగా నిజం చెప్పాను

రేఖ కళ్ళు వెడల్పుచేసి చూసి ఒకటే నవ్వింది. ''జోక్‌గా మాట్లాడద్దు''అంది

నేను సీరియస్‌గా చెప్తోంటే రేఖ జోక్‌గా తీసుకోవడం నాకు కోపం తెప్పిం

చింది,

బస్ సంఘటన చెప్తే రేఖ ఆశ్చర్యంగా విని ఒకటే ప్రశ్న అడిగింది

"అయితే నీకింతకూ బాధ దేనికి?"

"తను అనవసరంగా నన్ను రెచ్చగొట్టి అల్లరయిందేనని నాబాధ."

రేఖ నా మొహంలోకి చూస్తూ ఏదో అర్థం అయినదానిలా చిఱునవ్వు నవ్వింది

"రాజీవ్ నీకెందుకు కవితంటే ఆసక్తి?"

"నాకా!!"

"చాల్లే రాజూ నాదగ్గర దాచకు నీవు నాబర్త్‌డేకి వచ్చినరోజే గ్రహించాను '

మైగాడ్! ఈరేఖ ఏదో, నామనసులోపల దాగిన నాకోరికను గ్రహించింది, కాని నేను త్వరగా బయటపడ్డం నాకిష్టంలేదు నేనంటే ఏలక్ష్యమూలేని కవితమీద నా నిశ్చితాభిప్రాయం రేఖతో చెప్తే, ఆమె దృష్టిలో నేను పలుచనయి పోతాననే భయం కలిగింది అందుకే బెట్టుపోకుండా చెప్పాను "కవితంటే నాకే ఆసక్తిలేదు రేఖా నన్ను నమ్ము."

"అయితే నీవుకూడా కవితను హేట్ చేస్తున్నావా? '

ఒకరోజు కవిత, రేఖల సంభాషణ గుర్తొచ్చింది "నీవుకూడా అంటే ?' అనుమానంగా అడిగాను రేఖ చప్పున మాట మార్చేసింది

"ఏం లేదు చిన్నప్పుడు నేర్చుకోలే? ఆపోజిట్ పోల్స్‌కు అట్రాక్షన్ ఎక్కువని జాగ్రత్త" అంది నవ్వు దాచుకుంటూ. ఇంతలో చిన్నాన్న వచ్చి కాసేపు ఏదో లోకాభిరామాయణం మాట్లాడ్డంతో అరగంట గడిచిపోయింది ఆ తర్వాత హాస్టల్‌కు వెళ్లిపోయాను రేఖ ప్రశ్న నామనసులో మిగిలిపోయింది

"నిజమే! కవితంటే ఆసక్తి ఎందుకు, తనంటే నాకెందుకో ఇష్టం అని గ్రహించగల్గాను నాకు తెలీకుండా కల్గే ఈ భావమే ప్రేమా? నా ఇష్టాన్ని ఎన్నిరకాలుగా వెల్లడించాలని అనుకున్నా కవిత సీరియస్‌నెస్ అడ్డొచ్చేది తనకు ఏం లేకున్నా గర్వం ఉంది బహుశ దానికే నేను ఆకర్షితుడినయ్యానేమో, ఇద్దరం పైకి ద్వేషించుకుంటున్నాం. తనకుకూడా నేనంటే ఇష్టం ఉంటే! ఆ వూహే హఠాత్తుగా జాజుల పరిమళం వీచినంత హాయిగా అన్పించింది కాని అది అసంభవం

* *

పై సంఘటన గడిచి దగ్గరదగ్గర నెల రోజులు కావస్తోంది కవిత కాలేజికి సక్రమంగా రావడంలేదు పరీక్షలు దగ్గర పడ్తున్నాయి నేను హాస్టల్ రూంలో పడుకుని కెమిస్ట్రీ చదువుతూంటే విజిటర్స్ వచ్చారని తెలిసి బయటికి వెళ్ళాను రేఖ త్వరగా వచ్చింది "రాజీవ్ అర్జెంట్‌గా వెళ్ళాలి కవిత ఒకటే ఏడుస్తోంది" అంది వగరుస్తూ నేను తెల్లబోయాను

"ఏం జరిగింది?"

"వాళ్ళమ్మ చనిపోయింది."

నేనలాగే రేఖ వాళ్ళ కారులో కూర్చున్నా. కవితకు కలిగిన ఈ ఆకస్మిక దుఃఖాన్ని నేనెలా ఓదార్చాలా అని ఆలోచించా దారిలో. ఇరుగుపొరుగుతో కవిత వాళ్ళిల్లు నిండిపోయింది. కవిత కన్నీళ్ళు చూడాలనుకున్నా కాని ఈ రకంగా కాదు. ఎడ్చి, ఏడ్చి సొమ్మసిల్లి పడిపోయిందో మూలకు కవిత స్పృహలో లేదు. మొత్తాని కారోజు కర్మకాండలన్నీ జరిగిపోయాయి. రెండురోజుల అనంతరం హై ఫీవర్‌తో హాస్పిటల్ చేరింది కవిత.

పళ్ళూ, బిస్కెట్స్ తీసుకుని కవిత గదిలోకి వెళ్ళాను. కవిత పక్కనే కూర్చున్న రేఖ నన్ను చూడగానే బయటికి వెళ్ళింది. నేను పట్టుపడిన దొంగలా గదిలో నిలబడిపోయాను. బెడ్ మీద ముడుచుకుని నీరసంగా పడుకున్న కవిత కళ్ళెత్తి నన్ను చూసింది. ఉన్న ఒక్క ఆత్మీయురాలిని పోగొట్టుకున్న కవితను చూడగానే నా మనసు ఆమెపట్ల జాలితో నిండిపోయింది. నీకు నేతోడున్నానని చెప్పి ఆమె దుఃఖం పోగొట్టా లనుకున్నాను. పళ్ళు అవీ తెచ్చి అక్కడ పెట్టాను.

"వద్దు. దయచేసి అవి తీసుకెళ్ళండి. నా గురించి ఇప్పటికే మీరు చాలా శ్రమ పడ్డారు" అంది. మరోవైపు పడు కుంటూ. నేను నిర్ఘాంతపోయాను. తన అయిష్టాన్ని ఇంత బహిరంగంగా ప్రకటిస్తుం దనుకోలేదు. నా అభిమానం ఏ మాత్రం మిగల్లేదు. ఛ! నేనెంత ఫూల్‌ని. నేనంటే ఏమాత్రం సదభిప్రాయం లేని అమ్మాయికోసం ప్రాకులాడ్డం ఎంత వృధా.

"సారీ కవితా! మీ మనసుకు కష్టం కల్గించాను. మీరసలు నామీద ఎంత దురభిప్రాయంతో ఉన్నా నన్నిన్నివేళలా అపార్థం చేసుకోవడం న్యాయం కాదు. నే నెదురుపడ్తేనే మొహం చిట్లించడం నన్ను తప్పుకుతిరగడం మీ కలవాటయింది. కాని కవితా మీలో ఏదో ఆకర్షణ నన్ను మీచుట్టూ తిప్పుతోంది. అది నా తప్పుకాదు. సరే పోనివ్వండి. రేఖ నాతో ఒకసారి చెప్పింది "కవితతో ఫ్రెండ్‌షిప్ చేసి చూడు. తన ప్రత్యేకత నీకు తెలుస్తుంది" అని చెప్పింది. కాని మీతో ఫ్రెండ్‌షిప్ చేయకుండానే మీ వ్యక్తిత్వాన్ని, అభిమానాన్ని గ్రహించి మీకు దగ్గరవుదామని దురాశ పడ్డాను. ఇవన్నీ మీ దృష్టిలో నన్ను దోషిగా నిల బెట్టాయి. జరిగిందంతా మర్చిపొండి. ఎన్నడూ ఎవరికీ క్షమాపణ చెప్పుకోని ఈ రాజీవ్ మిమ్మల్ని మనస్ఫూర్తిగా క్షమించమని అడుగుతున్నాడు. ఎందుకో తెల్సా? మిమ్మల్ని మనసారా అభిమానించిన నేరానికి." నాకు తెలీకుండానే నా మనసులో బాధ కొంత బయటపెట్ట గల్గాను. అంతా చెప్పేసి నేను గుమ్మం


వాటేసరికి దిండులో తలదూర్చి కవిత సన్నగా ఏడుస్తోంది వికలమనస్కంగా వెళ్ళిపోయాను గాని లేకుంటే లోపలికి వెళ్ళి కవితను గుండెల కదుముకుని ఓదార్చేవాడినేమో!

ఇక కవితను మర్చిపోవాలనే స్థిర నిశ్చయం చేసుకున్నా నా మనసులో పరీక్షలప్పుడు రేఖతోపాటు కవిత పరీక్షలివ్వడం చూసాను ఎగ్జామ్స్ అయిపోయాయి కవిత ఈ మధ్యరోజుల్లో మునుపటిలా కాక నన్ను చూసేందుకు తహతహలాడ్తున్నట్టనిపించేది కాని అంతలోనే నా ఆలోచనకు నాకే నవ్వొచ్చేది నా ఆలోచనే తనకు అంటగడ్తున్నానేమో అన్పించేది కవితా! త్వరలోనే నీకు నా బాధ వదుల్తోంది నేనిక ఈ బాంబేకి రానే రాను

చిన్నాన్నవాళ్ళు నే వూరెళ్ళిపోతున్నానని పార్టీ ఇచ్చారు ఏరోడ్రోమ్‌కు రేఖతోపాటు కవిత రావడం నాకు విస్మయం కల్గించింది. కారు ఏరోడ్రోమ్ చేరగానే చిన్నాన్న, పిన్ని రేఖ ముందుగా నడిచారు కవిత నెమ్మదిగా కారు దిగింది వెంటనే నేను కారు డోర్ వేసేసాను ఆమె పైట దాన్లో ఇరుక్కుంది చటుక్కున డోర్ తెరచి కొంగును వదిలించాను ఆమె పైటలాగే ఆమె నా మనసులో ఇరుక్కుపోయింది దాన్ని ఎలా తీయగలను?

నేను కావాలని డోర్ వెసాననుకుంటుందేమోనని ఆమెతో చెప్పాను "మేడమ్ ఈవాళ ఈ బాంబేలో నేనుండడం లాస్ట్ డే వెళ్ళిపోయే ముందు నాతో పోట్లాటకు రాకండి"

నేననుకోని విధంగా కవిత నా కళ్ళల్లోకి నిముషంపాటు తదేకంగా చూసి అందంగా నవ్వింది నా జన్మ ధన్యమయినట్లు ఫీలయ్యాను ఆమె మెరిసే కళ్ళతో ఏదో చెప్పబోయింది ఇంతలో కొంపలు ముంచుకుపోయినట్లు రేఖ పరుగెత్తుకుంటూ వచ్చి, "సారీ కవితా! నిన్ను వదలి ముందెళ్ళిపోయాను" అంటూ కవితను తీసుకుపోయింది అందరి దగ్గరా వీడ్కోలు తీసుకుని కవితకేసి చూసాను, ఏదో చెప్పాలని ఆగిపోయినట్లు ఆమె పెదాలు చిన్నగా కంపిస్తున్నాయి ఆమె కళ్ళల్లో ఏదో బాధ మెదలుతోంది అంతే! నేను వాళ్ళనుంచి విడిపోయాను రెండేళ్ళు కాలగర్భంలో కలిసిపోయాయి. నేను డిగ్రీ తీసుకుని బిజినెస్‌లో నాన్నకు చేదోడువాదోడుగా ఉంటున్నాను రేఖకు ఈ మధ్యకాలంలోనే పెళ్ళయింది అమ్మా నాన్న వెళ్ళారు ఆమె పెళ్ళికి పోవాలంటే భయం వేసింది మళ్ళీ కవిత కన్పించవచ్చు మళ్ళీ ఆమెను చూడగానే నేనేమవుతానో నాకే తెలీదు, చేతినిండా పని కల్పించుకుని ఆలోచించడానికే తీరిక లేకుండా చేసుకుని కవితను మర్చిపోదలిచాను. ఈ పాటికి కవితకూ పెళ్ళయిపోయి ఉంటుంది కాని ఎవరి జ్ఞాపకాలకు




తూరం కావాలనుకున్నానో వారు మనసు లోనే నిలిచిపోయారు.

*    *

పొద్దున్నే బాలయ్య వచ్చి లేపేవరకూ మెలకువరాలేదు బద్దకంగా వళ్ళు విరుచుకుని టైమ్ చూసాను ఎనిమిదయింది రాత్రంతా ఆలోచనలతో గడిపినందుకు తల భారంగా వుంది చప్పున లేచి మొహం కడుక్కుని తయారయ్యాను నేను టిఫిన్ చేస్తున్న సమయంలో నాన్న వచ్చి "రాజీవ్ రేఖావాళ్ళొచ్చారు" అని చెప్పారు నేను హఠాత్తుగా లేచి చేయి కడుక్కుని వరండాలోకి వచ్చాను రేఖ ఆమె భర్తా ఇద్దరూ లోపలికి వచ్చారు

"హల్లో రాజీవ్! కంగ్రాట్స్! ఎంగేజ్‌మెంట్‌డేకి రాగల్గాం" అంది నవ్వుతూ రేఖ "ఎంగేజ్‌మెంట్ డే" అని వత్తిపలకడం నాకు చివుక్కు మనిపించింది నన్ను ఎత్తి పొడుస్తోందా?

రేఖ స్నానంచేసి తయారయి డిన్నరుకు కావాల్సిన ఏర్పాట్లు చూస్తోంది నేను తనని పిలిపించగానే నా రూంలోకి వచ్చి కుర్చీలో కూర్చుంటూ "ఏమిటి విశేషాలు రాజీవ్!" అంది అప్పటి చలాకీతనం ఆమెలో పోలేదు

"మీ కవిత బాగుందా? సూటిగా అడిగాడు.

"ఎవరూ? కవితా! ఓ కవితనా!" అంది అప్పుడే గుర్తుకు తెచ్చుకుంటున్న

ష్లుగా

"అఁ! గుర్తొచ్చిందా నీకంటే నేనే నయం" అన్నాను ఎగతాళిగా

"వూఁ! సరేలే! అక్కడున్నన్నాళ్ళూ ఆ పిల్లను ఏడిపించుక తిని ఇప్పుడు కవిత బాగుందా అని అడుగుతున్నావు. ఇంత ప్రేమ ఎప్పుడు పుట్టుకొచ్చింది?"

"తనను చూసిన్నాటినుంచే"

"నీవు మరీ కోతలరాయుడవుతున్నావు బాబూ. నన్ను వెళ్ళనీ నాకు చాలా పనుంది" రేఖ చేయి పట్టుకుని బలవంతంగా కూర్చోబెట్టాను.

"ఇంతకీ ఇప్పుడు తన సంగతెందుకు?"

"చెప్పేందుకేమీలేదుకాని నీకునిజంగా ప్రేమంటేతనవిషయం వినిబాధపడ్తావు."

నా గుండెలు ఆత్రంగా కొట్టుకున్నాయి. "కవితకేమయింది?"

"రాజీవ్! ఏం చెప్పను. వాళ్ళమ్మ పోయాక మరీ వంటరిదయిపోయింది కవిత. ఎప్పుడూ మనింట్లోనే వుండేది. వాళ్ళత్తయ్యకూ తనకూ సరిపోయేది కాదు. వెళ్ళిపోయాక తను చాలా మారిపోయింది. గంటలు గంటలు శూన్యంలోకి చూస్తూకూర్చునేది. అకస్మాత్తుగా కన్నీళ్లు పెట్టుకునేది. నేనేమన్నా పట్టిపట్టి అడిగితే మా అమ్మ గుర్తొచ్చింది అనేది. కాని నేను గ్రహించింది ఏమంటే కవిత కూడా నిన్ను ప్రేమిస్తోంది"

"రేఖా! అవు. వేళాకోళానికి హద్దుండాలి. నేన్నమ్మను. తను ప్రేమిస్తోందని నీవే అబద్ధాలాడుతున్నావు"

"రాజీవ్! నే చెప్పేది అక్షరాలా నిజం. మొదట్లో నిన్ను కాలేజీలో చూడగానే తనకు నీవంటే మంచి అభిప్రాయం ఏర్పడిందంట. నీవు సామాన్యుడవనుకుంది ముందు. కాని నీవు ధనవంతుల ముద్దుబిడ్డవని తెలిసి చాలా క్రుంగిపోయిందట. తనకు తెల్సు నీవు తనను ప్రేమిస్తున్నావని. కాని అందని పళ్ళకు అర్రులు చాచేది కాదు కవిత. అందుకే నిన్ను అసహ్యించుకున్నట్లుగా దూరం తొలగిపోయేది. నీవు మొదట అందరిలాగే భావించి కవితతో స్నేహం చేయబోయి విఫలుడివయ్యాక నీకు కవితంటె మోజు పెరిగింది. ఆమె ప్రేమను పొందడంకోసం ఎన్నో చేసావు. ఆఖరికి ఆమెనే ద్వేషించావు. కాని కవిత నీవు ధనవంతుడవని తెలిసి, ఏ ప్రేమను చంపుకోవాలనుకుందో ఆ ప్రేమకు చావులేదని తెలుసుకుంది. నిన్ను దూరం చేసిన ప్రతి సంఘటనా తలుచుకుని మానసికంగా క్రుంగిపోయేది. నీకు కావాలనే దూరంగా వున్న కవితను గర్వంగా అంచనా వేసుకున్నావు. కాని ప్రతినిముషం నీగురించే ఆలోచిస్తుందంటే నీవు నమ్ముతావా?"

"రేఖా! రేఖా! ఇది నిజమా? నన్ను కవిత ప్రేమిస్తోందా." ఆనందంతో నా మతిపోయింది.

"నిజం! నిన్నెంత ఆరాధిస్తోందంటే నీకోసం తను పెళ్ళి మానేసింది. కాని పాపం. విధివంచిత కవిత!"

"రేఖా! ఏమయింది? కవిత కేమయింది?"

"తను ప్యాసు కాగానే లాబ్‌లో జాయినైంది. ఒక దురదృష్టపు రోజున —స్టూడెంట్స్‌కి ఏదో టెస్టు గురించి చెప్తోంది. పరీక్ష చేస్తూన్న స్టూడెంటు చేతిలోని టెస్ట్‌ట్యూబ్ పగిలింది ప్రమాద వశాత్తూ. దాంతో ఆసిడ్ చిమ్మి కవిత కళ్ళలో పడింది....ఆమె కళ్లు...."

"రేఖా!........" నా మనసు బాధతో సుళ్లు తిరిగింది. నా కళ్ళల్లో వెచ్చగా నీరు చలిస్తోంది. "తనెక్కడ ఇప్పుడు?" నా కంఠం కంపించింది.

"ఇక్కడే సరోజినీదేవి హాస్పిటల్లో వాళ్ళ మామయ్య చేర్పించారు. ఏదో ఆప రేషన్ చేస్తారట." రేఖ ప్రక్కకు తిరిగి కళ్ళు తుడుచుకుంది.

"జీవితంలో భయంకరంగా ఓడి పోయిన కవితను గురించి ఆలోచించి మనసు పాడుచేసుకోకు రాజీవ్. జరిగిం దంతా మర్చిపో" రేఖ వెళ్ళిపోయింది. నేను తలుపులు మూసుకున్నాను. సరిగ్గా మరోగంటకు నీనా గొంతు మృదువుగా విన్పించింది. "రాజీవ్ తలుపు తీ!"

తలుపు తీసిన నాకళ్లకి జిగేల్‌మని దేవత ప్రత్యక్షమయినట్టు కన్పించింది.

"అరె! అదేమిటి. నీకళ్ళు వాచాయి. ఏమయింది?" అంటూనన్ను కుదిపే సింది నీనా. ఆమెను వదిలించుకున్నా.

పోర్టికోలో ఎర్రగా మెరిసే నాకారు కన్పించగానే చకచకా వెళ్ళి దానో కూర్చున్నాను

నిమిషంలో హాస్పిటల్ చేరుకుని కవిత రూం వెతికి పట్టుకోగ్గలాను నాలో ఏదో ఆత్రుత, భయం ఆనందం నిండిపోయి తొందర పెడ్తున్నాయి నాకు కావాల్సింది కవిత. ఇది చాలా నిదానంగా తెల్సుకున్నాను. నేను మును పటి రాజీవ్‌ను కాను. అహం, గర్వం, ధనమదం అని నన్నావరించిన తెరలన్నీ తొలగిపోయాయి. నా అంతరంగంలో వెలిగేజ్యోతే కవిత!

బెడ్ మీద పడుకుని కళ్లమీద బాండేజీని వేళ్ళతో తడుముకుంటోంది. వడిలిన గులాబీలాగుంది ఆమె మొహం. డాక్టర్, నర్స్ బయటికి వెళ్ళగానే నేను తన దగ్గ రికి నడిచాను.

"ఎవరూ?" కవిత కమ్మని కంఠం పలికింది.

వచ్చే నిట్టూర్పు నణచుకుంటూ చేయందిచ్చాను. నాచేయి స్పర్శతగల గానే అపరిచితమైనదని గ్రహించి వదిలే సింది. కాని నాచేయి విడిపోలేదు. "నేను కవితా!"

దిగ్గున లేచింది కవిత "మీరా! రాజీవ్!"

ఒక్కసారి నావళ్లు పులకరించింది కాని కవిత మొహంలో ఏవో నీలినీడ లావరించాయి.

"కవితా. రేఖ అంతా చెప్పింది. నేను నీకోసం వచ్చాను" ఆపుకున్నా ఆగని ప్రేమవాహిని నా కంఠంలో తొణికిసలాడింది. కవిత మొహంలో ఎలాంటి మార్పులేదు.

"క్షమించండి!....మీరు .... మీరు" తడబడ్తూ ఏదో చెప్పబోయింది. నేను మృదువుగా ఆమె నోటిని నా చేత్తో మూసేసాను. "ఏమీ చెప్పద్దు కవితా. రేఖ నీ గురించి అంతా చెప్పింది. ఇన్నాళ్ళూ నీ హృదయంలో గుప్తంగా ఆ ప్రేమ నెలా దాచుకో గలిగావు? కవితా నీకోసం ఎంత వెఱ్ఱి వాడ్నయ్యాను నా ధనం మనిద్దరికీ ఎన్నడూ అడ్డునిలవదు నా ప్రేమ సంగీకరించు నాక్కావలసింది నన్ను ప్రాణంగా ప్రేమించే మనసు! అది నీలో వుంది. ఈరోజు నీ కళ్ళు పోయినా ఆ కంటివెలుగు నేనై పోతా కవితా. ఇది నా అదృష్టం! ఆఖరిక్షణాన్నయినా నిన్ను పొందగల్గుతున్నాను ' కవిత చేతిని పట్టుకుని భావావేశంతో చెప్పాను.

కవితమొహం విప్పారింది, ఇంతలో 'ఎక్స్క్యూజ్ మి" అంటూ డాక్టర్ లోపలికి వచ్చి "మీరు కొంచెం బయటికి పోతారా?" అనడిగాడు. నేను బయటికి వెళ్లాను.

పదిహేను నిముషాలనంతరం డాక్టర్ బయటికివచ్చి చిన్నగా నవ్వి "యు కెన్ గో!" అనేసి వెళ్ళిపోయాడు. నేను లోపలికి పోయి నోట మాటలేకుండా నిలబడిపోయాను. కవిత వెన్నెల విరజిమ్మే కళ్ళతో చూస్తోంది నన్ను.

"అరె! నీకళ్లు........"

"బాగున్నాయి. రేఖ నాటకం ఆడింది. నాకు కంట్లో ఏదో లేస్తే మూడురోజుల క్రితం మైనర్ ఆపరేషన్ చేసారు. అందుకే ఈగంతలు. అప్పుడే రేఖనన్ను చూసి పోయింది" అంది నవ్వుతూ.

నా మొహం ఎర్రగా కందింది.

"అయితే రేఖ చెప్పిందంతా అబద్ధమా?"

"కాదు! కళ్ళు పోవడం ఒక్కటే అబద్ధం" కవిత సిగ్గుపడినదానిలా తలదించుకుంది.

నేను పట్టలేని ఆనందంతో కవితను కౌగలించుకున్నాను.

"స్టుపిడ్ రేఖ! నాకు మతిపోగొట్టి తిరిగి తెచ్చింది. నాది ట్రూలవ్ కాదేమోనని టెస్ట్ పెట్టింది. ఏం కవితా నే గెలిచానా?"

కవిత జవాబుగా నా గుండెల్లో తల దాచుకుంది.